క్లుప్తంగా

ఉపాధి హామీ పథకం ఈసీగా సింగారావు



పొన్నూరు: ఉపాధి హామీ పథకం మండల ఇంజినీరింగ్ కన్సల్టెంట్‌గా కాకాని సింగారావు నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన కాకుమాను మండలం నుంచి బదిలీపై వచ్చారు. టెక్నికల్ అసిస్టెంట్ జె.రామకృష్ణ పొన్నూరు నుంచి కాకుమాను మండలానికి బదిలీ అయ్యారు. టెక్నికల్ అసిస్టెంట్ కె.రత్నరాజు కాకుమాను నుంచి పొన్నూరుకు బదిలీపై వచ్చారు. సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

మినుము పంటకు నిప్పు పెట్టడంపై ఫిర్యాదు

పెదకాకాని: మినుము పంటకు నిప్పు పెట్టడంతో బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెదకాకాని మండలం నంబూరు గ్రామానికి చెందిన కూసం శ్రీనివాసరెడ్డి 3.5 ఎకరాల్లో, ఆయన సోదరుడు కూసం సతీష్‌రెడ్డి 4 ఎకరాలు మినుము సాగు చేశారు. మినుము పీకిన తరువాత ఎండిన ఓదెలను కల్లంలో కుప్పలుగా వేశారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కల్లంలో ఉన్న మినప కట్టెకు నిప్పు పెట్టారు. పొలాలకు వెళ్లిన వారి సమాచారంతో అక్కడకు వెళ్లి చూస్తే మినప కట్టె అందులో ఉన్న మినుములు కాలిబూడిదయ్యాయి. దీంతో బాధిత రైతు కూసం సతీష్ రెడ్డి ఆదివారం పెదకాకాని పోలీసుస్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. సుమారు లక్ష రూపాయల మినుములు కాలిబూడిదయ్యాయని పేర్కొన్నారు. మినుము కట్టె తగలబెట్టిన ఘటనలో గ్రామానికి చెందిన ఓ ట్రాక్టర్ డ్రైవర్, మా యజమాని మినప కట్టెకు నిప్పు పెట్టమంటే పెట్టానని చెప్పడం విశేషం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ టీపీ నారాయణస్వామి తెలిపారు.

రాష్ట్ర స్థాయి యూత్ పార్లమెంట్ పోటీలకు ఏటుకూరు విద్యార్థిని



గుంటూరు రూరల్: రాష్ట్ర స్థాయి యూత్ పార్లమెంట్ పోటీలకు ఏటుకూరు విద్యార్థిని ఎంపికైంది. ఏటుకూరు గ్రామానికి చెందిన ఆళ్ల స్వరాజ్యలక్ష్మి నగరంలోని టీజేపీఎస్ కళాశాలలో బీఎస్సీ కెమిస్ట్రీ విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఇటీవల టీజేపీఎస్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి స్వరాజ్యలక్ష్మి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 28న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలలో ఆమె పాల్గొననున్నట్లు విద్యార్థిని తండ్రి ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఆళ్ల రవి దేవరాజు తెలిపారు. ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని గ్రామ ప్రజలు పెద్దలు ప్రత్యేకంగా అభినందించారు.


ప్రజా సంక్షేమమే మోదీ సర్కార్ ధ్యేయం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు



చేబ్రోలు: కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సర్కార్ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం మండల కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షుడు నారిశెట్టి శ్రీరామ చంద్రమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడుగా తిరుపతిరావును పార్టీశ్రేణులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ గౌడ్, వైవీ సుబ్బారావు, కేవీ సుబ్బారావు, దానబోయిన శివయ్య, కిసాన్‌మోర్చా జిల్లా కార్యదర్శి ఎం శీతారామయ్య, జూటూరి మురళి, పాట్లూరి చంద్ర పాల్గొన్నారు.

లవ్ యువర్ ఫాదర్ చిత్ర యూనిట్ సందడి



గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డలో నూతన చిత్రం లవ్ యువర్ ఫాదర్ చిత్ర యూనిట్ ఆదివారం సందడి చేసింది. గ్రామంలోని రామాలయంలో చిత్ర హీరో శ్రీహర్ష ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా హీరో మాట్లాడుతూ గ్రామీణ వాతావరణంలో ప్రతి కుటుంబంలో జరిగే సన్నివేశాలతో ప్రతి ఒక్కరి హృదయాలను హత్తుకునే సినిమాగా వివరించారు. ప్రతి కుటుంబంలో తండ్రి పాత్ర ఏవిధంగా ఉంటుందో తెలియజేసే సినిమా అన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో జరిగిన ఘటనలతో ప్రతి సన్నివేశం మనసుకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో చిత్ర నిర్మాత డాక్టర్ ఏ రామస్వామి, వంగా నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల పస్తులు

70 రోజులైనా అందని జీతం

- అదిగో.. ఇదిగో అంటున్న అధికారులు
- ఇబ్బందులు పడుతున్న పేదలు



పంట కాలువ పనులు చేస్తున్న కూలీలు

పొన్నూరు: గ్రామాల్లో వలసల కట్టడి ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యం నీరుగారుతోంది. కూలీలకు సకాలంలో వేతనాలు అందడం లేదు. రోజువారీ మస్టర్లు వేస్తూ బిల్లులు జనరేట్ చేస్తున్నా కూలి మాత్రం పడటం లేదు. దీంతో కుటుంబాలు గడవడం ఇబ్బందిగా మారింది. పనులు చేస్తున్నా, వేతనాలు చెల్లించడంలో తీవ్ర జాప్యం ఏర్పడుతోంది. దీంతో నెలల తరబడి వేతనాలు చెల్లించకపోతే ఎలా అని కూలీలు సంబంధిత అధికారులను ప్రశ్నిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఉపాధి పనుల కల్పనలో తాత్సారం చేస్తున్నారు. గ్రామాల్లో అంతంత మాత్రంగా పనులు జరుగుతుండగా, వీటిలో పాల్గొన్న వేతనదారులకు వేతనాలు అందని దుస్థితి. జనవరి 15వ తేదీ నుంచి పనులు చేసిన వారికి వేతనాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు.

పొన్నూరు మండలంలో10, 127 జాబ్ కార్డులు ఉండగా, 13,742 మంది ఉపాధిహామీ కూలీలు ఉన్నారు. వీరందరూ ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు.

భారీగా బకాయిలు

ప్రతి కూలీకి పని కల్పించి పనిని బట్టి సగటున రూ.250, నుంచి రూ.300 వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులు సిబ్బందికి సూచిస్తున్నారు. క్యాటిల్ షెడ్ల నిర్మాణం, నీటి కుంటలు, గృహ నిర్మాణం, ఉపాధి కూలిపనులు వంటి పనులు చేశారు. రోజువారి వేతనం ప్రకారం ఒక్కొక్కరికీ సుమారు రూ.20 వేలకు పైగా బకాయిలు ఉన్నాయి. ఒక ఇంట్లో ఇద్దరేసి వ్యక్తులు పనికి వెళ్తే ఒక్కో కుటుంబానికి రూ.40 వేలకు పైబడి కూలి చెల్లించాల్సి ఉంది. వేతనాలపై సంబంధిత అధికారులు పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని కూలీలు వాపోతున్నారు. రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో అధికారులు చర్యలు తీసుకొని బకాయిలు వెంటనే ఖాతాలకు జమ చేయాలని వేతనదారులు కోరుతున్నారు.

పొన్నూరు మండలంలో జనవరి 15 నుంచి రావాల్సిన వేతన బకాయిలు

పని చేసిన గ్రామాలు	23
జాబ్ కార్డులు	10,127
ఉపాధి హామీ కూలీలు	13,742
వేతనాలు రావాల్సిన మస్టర్లు	22,550
రావాల్సిన వేతన బకాయిలు	రూ.55,37,500 లక్షలు

వేతనాలు వెంటనే చెల్లించాలి

రోజూ ఉపాధి పనులు చేస్తున్నాం. జనవరి నెల నుంచి మాకు కూలి ముట్టలేదు. అధికారులను అడిగితే ఇంకా డబ్బులు జమ అవ్వలేదని చెబుతున్నారు. దీంతో రోజురోజుకి బకాయిలు పెరుగుతున్నాయి. ఇల్లు గడవడం కష్టమైంది. పని చేసిన దానికి డబ్బులిస్తే మాకు చేయడానికి ఇబ్బంది ఉండదు. కూలి ఇవ్వడం లేదని చాలా మంది పనులు మానుకుంటున్నారు.

– వెంకట్రామయ్య, ఉపాధి కూలీ, కొండముది

నెలాఖరులోగా చెల్లిస్తాం



ఉపాధి వేతనాలకు సంబంధించి నిధులు విడుదల కావాల్సి ఉంది. సుమారు ఆరు నుంచి ఏడు వారాలుగా వేతనాలు పెండింగ్లో ఉన్నాయి. నిధులు వచ్చిన వెంటనే జమ చేస్తాం. వారం, పది రోజుల్లో వస్తాయని భావిస్తున్నాం. వేతనదారులు ఆందోళన చెందవద్దు, పూర్తి స్థాయిలో వేతనాలు చెల్లిస్తాం.

–గుమ్మా చంద్రశేఖరరావు, ఎంపీడీఓ, పొన్నూరు

ముస్లింల అభ్యున్నతికి కృషి

- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- ఘనంగా అంజుమన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు నరేంద్రకుమార్, నసీర్ అహ్మద్

పొన్నూరు: ముస్లింల అభ్యున్నతికి కృషి చేస్తానని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి సహకారం అందిస్తానని తెలిపారు. పట్టణంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం షాదీఖానా ఆవరణలో పొన్నూరు అంజుమన్ ఏ ఇస్లామియా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కేంద్ర సహాయ మంత్రితో పాటు ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, నసీర్ అహ్మద్, జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజుమన్ కమిటీ నూతన అధ్యక్షులుగా మగ్బుల్ బేగ్, గౌరవాధ్యక్షులుగా షేక్ మహమూద్, కార్యదర్శి షేక్ బాజ్జీ, ఉపాధ్యక్షులు మొల్లా నసీరుద్దీన్, సహాయ కార్యదర్శులు షేక్ మౌలాలి, షేక్ అబ్దుల్ మజీద్, కోశాధికారి మహ్మద్ గౌస్‌తో పాటు 37 మంది సభ్యులుగా ప్రమాణం చేశారు. అనంతరం అతిథులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో ఆదివారం అనారోగ్యంతో బాధపడుతున్న వారి చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్ర సహాయక శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన 13 మందికి, పట్టణానికి చెందిన 10 మందికి చెక్కులను అందజేశారు.

మలినేనిలో ముగిసిన ఫేజ్3 స్పాన్సర్డ్ హ్యాకథాన్



పలు ప్రాజెక్టులలో విజేతలతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 17వ తేదీన ప్రారంభమైన ఐఎస్ఈఏ ఫేజ్ 3 స్పాన్సర్డ్ హ్యాకథాన్ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ముగింపు వేడుకల్లో ఏపీ టెక్నాలజీ సర్వీస్ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ పాల్గొని మాట్లాడుతూ జేఎన్‌టీయూకే, మలినేని లక్ష్మయ్య కళాశాలలు సంయుక్తంగా నిర్వహించిన 5రోజుల డేటా అనలిటిక్ ఫర్ ఫైనాన్షియల్ డిసిషన్ –మేకింగ్ కార్యక్రమ 36 గంటల హ్యాకథాన్‌తో ముగియటం సంతోషకరమన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి నారా లోకేష్, ప్రతిభావంతులైన విద్యార్థులను ఉత్తమ అవకాశాలు కల్పించడం కోసం కృషి చేస్తున్నారని చెప్పారు. ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్, ఆర్థిక పరమైన సైబర్ సెక్యూరిటీ వంటి రంగాలలో ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు వివరించారు. మలినేని కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ ఇలాంటి నూతన కార్యక్రమాలు విద్యార్థులకు మేలు చేస్తాయని చెప్పారు. విద్యార్థులు ప్రతి అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని. జేఎన్టీయూకే రెక్టార్ డాక్టర్ కేవీ రమణ మాట్లాడుతూ మలినేని లక్ష్మయ్య కళాశాలతో కలిసి కార్యక్రమ నిర్వహించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు రాజేష్ సుంకవల్లి, మేక్ స్కిల్ల్ సీఈఓలు విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులో మొదటి 5 స్థానాలలో నిలిచిన టీమ్‌లను ప్రకటించారు. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ కె.శ్వేత, డాక్టర్ జి.రామస్వామి, మధు పర్వతనేని పాల్గొన్నారు.

నూతన విద్యా పాలసీని రద్దు చేయాలి



కొత్తపేట భగత్ సింగ్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు

లక్ష్మీపురం: ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో కొత్తపేట భగత్ సింగ్ విగ్రహం వద్ద భగత్ సింగ్, రాజుగురు, సుఖదేవుల వర్ధంతి ఆదివారం నిర్వహించారు. వారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ మాట్లాడుతూ దేశంలోనూ, రాష్ట్రంలోనూ నూతన జాతీయ విద్యా విధానం పేరుతో దేశంలో ఉన్నటువంటి విద్యను పేద విద్యార్థులకు అందకుండా కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ వలి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సారథ్యంలో నరేంద్ర మోదీ మన దేశంలోని ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ యువత శ్రమను కార్పొరేట్ రంగాలకు అప్పగిస్తోందని చెప్పారు. ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టడానికి భగత్ సింగ్, రాజ్ గురు సుఖదేవ్ యొక్క పోరాట స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యశ్వంత్, నగర కార్యదర్శి ప్రణీత్, ఖాసీం వలి, డేవిడ్, అజయ్, సాగర్, వెంకీ, కిరణ్, గౌతమ్, శశి, మస్తాన్, సాయి గణేష్ పాల్గొన్నారు.

ఐకమత్యం ద్వారానే విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి సాధ్యం




మాట్లాడుతున్న పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కడియాల సుబ్బారావు

నెహ్రూ నగర్: సమష్టిగా విశ్వబ్రాహ్మణ సంఘం అభివృద్ధి సాధించేలా గుంటూరు పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం కృషి చేస్తుందని ఆ సంఘం అధ్యక్షులు కడియాల సుబ్బారావు పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణ సమాజం ఆత్మీయ సమావేశం అరండల్ పేట విశ్వబ్రాహ్మణ సమాజ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం శాసనమండలికి తప్పనిసరిగా ఒకరిని నామినేట్ చేస్తామన్న మంత్రి లోకేష్ త్వరలో ఒక నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. పశ్చిమ నియోజకవర్గం శాసన సభ్యురాలు గళ్లా మాధవి ఆదేశానుసారంగా విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి కావలసిన సంక్షేమ ఫలాలు అందుకోవటంలో వర్గాల కతీతంగా కలసికట్టుగా ముందుకు రావాలని కోరారు. కార్పొరేషన్, ఆదరణ వంటి పథకాల ద్వారా మంజూరు చేసే రుణాల కోసం దరఖాస్తులు చేసుకునే అవకాశం ఈనెల 25వ వరకు ఉన్నదని తెలియజేశారు. అమరావతి రోడ్డులోని బ్రహ్మంగారి దేవస్థానం పాలకవర్గాన్ని ఏర్పాటు చేసే క్రమంలో శాసనసభ్యులు గళ్లా మాధవికి పూర్తి స్వేచ్ఛనిచ్చినట్లు చెప్పారు. సమావేశంలో వెంకటప్రసాద్, సిద్దు చిరంజీవా చారి, భజరంగ్ రామకృష్ణ, కే లక్ష్మీనారాయణ, వేల్పూరి ఉమామహేశ్వరరావు, ఎస్.సాంబశివరావు, పి.శేష గిరిరావు, ఎమ్మెస్ రామకృష్ణ, డీఆర్‌సీ ప్రసాద్, డీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

వరస చోరీలు.. ప్రజలు బెంబేలు


పొన్నూరు: పట్టణంలో వరస చోరీలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. తాళాలు వేసిన దుకాణాలే లక్ష్యంగా దొంగలు రెచ్చిపోతున్నారు. ఆదివారం పొన్నూరు పట్టణంలోని వైన్ షాపు, ఇన్సురెన్స్, ఫైనాన్స్, టీస్టాల్, ఆటో మొబైల్ దుకాణాలలో దొంగలు చోరీలకు తెగబడ్డారు. హెల్మెట్ పెట్టుకుని చోరీలకు పాల్పడిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. రాత్రి 2 గంటల సమయంలో దొంగతనానికి పాల్పడినట్లు సమాచారం. కొంత నగదు, వస్తువులు, బైక్ అపహరణకు గురైనట్లు బాధితులు చెబుతున్నారు. క్లూస్‌టీం ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పట్టణ పోలీస్ స్టేషన్ అతి సమీపంలోనే దొంగతనాలు జరుగుతున్నా పోలీసులు దొంగలను పట్టుకోకపోవడంతో విమర్శలు వస్తున్నాయి.

విజ్ఞాన్ వర్సిటీ అధ్యాపకుడికి డాక్టరేట్



చేబ్రోలు: మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని అసిస్టెంట్ ప్రొఫెసర్ శేఖర్ మానేపల్లికు తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్స్లర్ పి.నాగభూషణ్ ఆదివారం తెలిపారు. ''డిజైన్ ఆఫ్ వైడ్ బ్యాండ్, అల్ట్రా-వైడ్ బ్యాండ్, సూపర్ వైడ్ బ్యాండ్ యాంటెనాస్ ఫర్ మైక్రోవేవ్ ఇమేజింగ్'' అనే అంశంపై ఆయన పరిశోధన చేశారని చెప్పారు. పీహెచ్‌డీ పట్టా పొందిన అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను పలువురు అభినందించారు.

ఏసీ కళాశాల అధ్యాపకురాలు నిర్మలకు పీహెచ్‌డీ ప్రదానం



గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ఏసీ కళాశాలలో ఆర్థికశాస్త్ర అధ్యాపకురాలిగా పని చేస్తున్న బుర్రి నిర్మలకు ఏఎన్‌యూ పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసింది. 'యాన్ ఎకనామిక్ ఎనాలసిస్ ఆఫ్ డైరీ ఫార్మింగ్ ఇన్ గుంటూరు డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అంశంపై ఏఎన్‌యూ ఎకనామిక్స్ విభాగాధిపతి ఆచార్య కడిమి మధుబాబు పర్యవేక్షణలో ఆమె పరిశోధన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బుర్రి నిర్మలకు సహచర అధ్యాపకులు, పరిశోధకులు అభినందనలు తెలిపారు.

నారీ లోకానికి దర్పణం గోగినేని భారతి



సన్మానిస్తున్న దృశ్యం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం శ్రీ పద్మావతి కల్యాణ మండపం వేదికపై ఆచార్య ఎన్‌జీ రంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ జక్కంపూడి సీతారామారావు నిర్వహణలో గోగినేని భారతీదేవి జ్ఞాపకార్థం సభ ఆదివారం నిర్వహించారు. ఆలయ పాలకమండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. చిగురుపాటి రవీంద్రబాబు సభాధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథి పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, వక్తలు విశ్రాంత అధ్యాపకులు వెలగా పుష్పకుమారి, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ వెలివోలు నాగరాజ్యాలక్ష్మి, డాక్టర్ జక్కంపూడి సీతారామారావు మాట్లాడారు. సభాధ్యక్షులు చిగురుపాటి రవీంద్రబాబు మాట్లాడుతూ గోగినేని భారతి నారీ లోకానికి దర్పణమని అన్నారు. బడుగు బలహీన వర్గాలు, చేతి వృత్తుల వారు, రైతులకు చేసిన సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. విశ్రాంత ప్రిన్సిపల్ నాగరాజ్యాలక్ష్మి మాట్లాడుతూ మహిళలకు ఉద్యమ స్ఫూర్తిని కల్పించారని అన్నారు. అనంతరం వక్తలను సత్కరించగా, పీవీ రమణ బృందం రైతు భజనావళి పాటలు ఆలపించి ఆహుతులను అలరించారు.

భగత్ సింగ్ యువతకు స్ఫూర్తి



మాట్లాడుతున్న సీఎస్ ప్రసాద్

లక్ష్మీపురం: కార్మికవర్గ రాజ్యం స్థాపన ద్వారానే సమాజంలో అసమానతలు తొలగిపోతాయని విప్లవ రచయితల సంఘం నాయకులు సీఎస్ఆర్ ప్రసాద్ అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ వర్ధంతి నిర్వహించారు. సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో లెనిన్ రచించిన 'రాజ్యం- విప్లవం' పుస్తకంపై విశ్లేషణ కార్యక్రమానికి జి.వెంకటరావు అధ్యక్షత వహించారు. తొలుత భగత్ సింగ్ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు, నగర కార్యదర్శివర్గ సభ్యులు బి.ముత్యాలరావు, కట్లగుంట శ్రీనివాసరావు, బి.సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు ఎంఏ చిష్టి, జి.రమణ, షకీలా, ఎ.కల్యాణి పాల్గొన్నారు.

భగత్ సింగ్‌ని ఈతరం స్ఫూర్తిగా తీసుకోవాలి

భగత్‌సింగ్‌ని నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. కొత్తపేటలోని భగత్ సింగ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భారత మాత విముక్తి కోసం తన సహచరులు రాజగురు, సుఖదేవ్‌లకు ఉరి కొయ్యాల్ని ముద్దాడి ఆనాడు లక్షలాది మంది యువతకు స్ఫూర్తినిచ్చారన్నారు. విద్యావేత్త ఇ.చంద్రయ్య మాట్లాడారు. కార్యక్రమంలో సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు పి.శ్రీధర్, ఆర్.వెంకటరత్నం, మురళీకృష్ణ, భావన్నారాయణ పాల్గొన్నారు.

ఇంటి తాళాలు పగలకొట్టి చోరీ

చేబ్రోలు: ఇంటి తాళాలు పగలకొట్టి చోరీకి పాల్పడిన ఘటన మండల కేంద్రమైన చేబ్రోలులో ఆదివారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన షేక్ ఇస్సాక్ తండ్రి రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో గుంటూరులోని వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఇస్సాక్, మొబీనా దంపతులు శనివారం ఇంటికి తాళాలు వేసి కుటుంబ సభ్యులందరూ వైద్యశాలకు వెళ్లారు. ఆదివారం ఇంటికి రాగా ప్రధాన ద్వారం తాళం పగలగొట్టి ఉండటంతో పాటు, ఇంటిలోని బీరువా పగలగొట్టి ఉంది. బీరువాలోని సుమారు 30 గ్రాముల విలువైన బంగారు గొలుసు, చెవి రింగులు, వెండి గ్లాసు, ఒక వెండి గిన్నెతో పాటు కొంత నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు షేక్ మొబీనా పోలీసులకు ఫిర్యాదు చేసింది. చేబ్రోలు పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో, ట్రైనీ ఐపీఎస్ దీక్ష కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. గుంటూరు నుంచి క్లూస్ టీం ఆధారాలను సేకరించారు.

ప్రజావసరాలు తీర్చేవిధంగా బ్రిడ్జి నిర్మించాలి

- ముందుగానే ఆర్‌యూబీ ఏర్పాటు చేయాలి
- చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఏల్చూరు



మాట్లాడుతున్న చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు

లక్ష్మీపురం: గతంలో ప్రకటించిన డిజైన్ ప్రకారం హిందూ కాలేజి నుంచి లాడ్జి సెంటర్ వరకూ బ్రిడ్జి నిర్మించాలని పౌర సంస్థల జేఏసీ నాయకులు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఏల్చూరు వెంకటేశ్వర్లు అన్నారు. బ్రాడీపేటలోని బాల నంద క్రేందంలో ఆదివారం శంకర్ విలాస్ బ్రిడ్జి పునఃనిర్మాణం నేపథ్యంలో ప్రస్తుత డిజైన్‌లో పలు మార్పులు చేయాలని కోరుతూ పౌర సంస్థల ఆధ్వర్యంలో ఫెడరేషన్ ఆఫ్ అపార్ట్‌మెంట్స్ అండ్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ ఎల్.ఎస్.భారవి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భవిష్యత్ కార్యాచరణ అమలు కోసం జేఏసీ ఏర్పాటు చేశారు. ఈనెల 26న శంకర్ విలాస్‌లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రచార కార్యక్రమం నిర్వహించాలని, కరపత్రాలు విస్తృతంగా పంపిణీ చేయాలని, షాపుల వద్ద బ్యానర్లు ఏర్పాటు చేయాలని, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించారు. పౌర సంఘాల సమాఖ్య నాయకులు కె.నళినీకాంత్ మాట్లాడుతూ రాబోయే 50 ఏళ్ల కాలంలో ప్రజల అవసరాలు తీర్చే విధంగా బ్రిడ్జి ఉండాలన్నదే తమ ఆకాంక్ష అని చెప్పారు. ఇప్పుడున్న డిజైన్ ప్రకారం జీజీహెచ్‌కి వెళ్లేందుకు, బ్రాడీపేట- అరండల్‌పేట మధ్య సరైన అనుసంధానం లేదన్నారు. బడ్జెట్ పరిమితి పెట్టుకొని ఇంత వరకే బ్రిడ్జి కడతాం అని చెప్పటం సరికాదన్నారు. ప్రస్తుత డిజైన్‌లో స్లోప్ తక్కువ ఉండటం వలన సైకిల్‌పై వెళ్లే వారు, నడిచి వెళ్లే వారు కష్టంగా బ్రిడ్జి ఎక్కాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రాజధానికి వెళ్లే ప్రధాన మార్గంలో నిర్మించబోయే ఈ బ్రిడ్జి ఐకానిక్‌గా ఉండాలని అభిప్రాయపడ్డారు. డిజైన్ మార్పుల కోసం జరిగే కార్యాచరణలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బిల్డర్స్ అసోసియేషన్ నాయకులు గద్దె తిరుపతిరావు, సీతారామయ్య, రేట్ పేయర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, ఫోరం ఫర్ డెమోక్రటిక్ అసోసియేషన్ నాయకులు అవధానుల హరి, ప్రోగ్రెసివ్ ఫోరం నాయకులు మల్లికార్జునరావు, ఎస్‌హెచ్‌ఓ అధ్యక్షులు డాక్టర్ టి.సేవాకుమార్, గుంటూరు గృహయజమానుల సంఘం మూర్తి, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ నాయకులు కైలాస్‌నాథ్, సదాశివరావు, గురుదత్, మట్టుపల్లి సుబ్బారావు పాల్గొని ప్రసంగించారు.

రేపు శివాలయం హుండీ కానుకల లెక్కింపు

పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 25వ తేదీన హుండీ కానుకలు లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. ఆలయంలోని హుండీలను దేవదాయశాఖ ఆదేశాల మేరకు ఉదయం 8:30 గంటలకు తెరచి కళ్యాణమండపంలో లెక్కించేందుకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

పాఠశాలకు బీరువా బహూకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: సంజీవయ్యనగర్‌లోని నగరపాలకసంస్థ ప్రాథమిక పాఠశాలకు గ్రంథాలయ పుస్తకాలను భద్రపరచేందుకు ఏఎస్పీ ఫౌండేషన్ చైర్మన్ సత్యప్రకాష్ బీరువాను బహూకరించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ప్రభుజీ ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా సత్యప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజూ పాఠశాలకు వచ్చి, చక్కగా చదువుకోవాలని, చదువుతో పాటు ఇష్టమైన కళలపై ఆసక్తి కనబర్చాలని సూచించారు. పాఠశాల కమిటీ చైర్మన్ కర్రా పరిమళ మాట్లాడుతూ విద్యార్థులు విద్యావంతులుగా ఎదిగి, మరొకరికి సాయం అందించే స్థాయికి ఎదగాలని సూచించారు. ప్రభుజీ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని కోరారు.